# వంకర గీతలు

పురాణం సూర్యప్రకాశరావు

పేరుకు రామనాథం. ఇన్నాళ్ళు ఎలా వుండేవాడని: కొంచెం ముక్కోపం అయినా మాలచ్చిని ఎంతో అపురూపంగా చూసుకునేవాడు. ఆమె చేతినిండా డబ్బు ఆడుతూండేది. ఆమె పిల్లలకోసం, తన కోసం ఎంత ఖర్చు చేసినా నోరెత్తి అడిగేవాడుకాదు. బావి దగ్గర చేతిలో చేద లాక్కుని ఇంటికి కావాల్సిన నీళ్ళన్నీ తోడిపోసేవాడు. వంట చేస్తూంటే పక్కనే కూర్చుని అప్పుడప్పుడు చేతిలో అట్లకాడ లాక్కుని మూకుడులో పేపుడు ముక్కలు కూడా తిప్పేవాడు. ఎక్కడెక్కడి సంగతులూ ఎత్తుకొచ్చి చమత్కారాలు, వేళాకోళాలు జోడించి నవ్విస్తూండేవాడు. పోనీ మాలచ్చి జగదేక రూపసా అంటే ఎంతమాత్రంకాదు. మనిషి చామన ఛాయలో వుండేది. చెవులకీ, ముక్కుకీ వున్న దుద్దులు ముక్కుపుడకా మెరుస్తూంటే నుదుటన కుంకం బొట్టుతో అద్దాలలో బిడ్డని వేసుకుని వంట గది గుమ్మం దగ్గర కూర్చుంటే రామనాథానికి ముద్దొచ్చేది. భార్యదగ్గర వున్నప్పుడు పిల్లలు చుట్టూమూగితే మాలచ్చి తనతో కబుర్లాడటంలేదని అలక సాగించేవాడు. రాత్రిపూట ఈ అలకలు, సముదాయింపులూ రసవత్తరంగా సాగిపోతూండేవి. రాత్రి ఇద్దరు పిల్లలు పందిరిమంచం నడుం ఎక్కి కూర్చుని ఒకళ్ళతో ఒకళ్ళు దెబ్బలాడుకుంటూనో, తెలిసీ తెలియని కథలు చెప్పుకుంటూనో ఎంతకీ నిద్రపోయేవారు కారు. మాలచ్చి వాళ్ళని సర్దుబాటు చేస్తూ. వాళ్ళ మాటల మధ్య తనూ ప్రవేశించి ముద్దులాడుతూ, వాళ్ళు చెప్పుకునే తెలిసీ తెలియని కథల్ని సరిచేస్తూ తన్ని పటించుకునేదేకాదు. చివరికి ఏ పదింటికో పక్కన చేరి మంచం చివర అంచున కూర్చునేది. కాసేపు పోయింతర్వాత మంచం మధ్యకు జరిగేది మరి కొంతసేపు పోయింతర్వాత ఆమె వేళ్ళతో రామనాథం జుట్టుని సవరిస్తే అంతే ఇంకేముంది? రామనాథం ఆ రసవాహినిలో తల మునకలయేవాడు.

అలాంటి మనిషి ఇలా అడ్డం తిరిగి పోయాడంటే మాలచ్చి తన దురదృష్టానికి భయపడి బాధపడి భర్త దగ్గర నానాగొడవా చెయ్యకపోలేదు. కనబడ్డ వాళ్ళందరి దగ్గరా చెప్పుకొంది. మొగుణ్ని రెండు పోటి మాటలంటే అవతల మనిషిని పది తిట్లు పచ్చి పచ్చిగా తిట్టింది.

"అసలెలా తగులుకొంది?"

"ఏమో.... పాడు.... నేను పచ్చి బాలింతరాలని గదిలో పడుకుంటే గదిలో ఉక్కగావుందని తను బయట వరండాలో పడుకునేవాడు. రోజూ ఈ పాపిష్టిచేతుల్తో నేనే వేసేదాన్ని ఆపక్క. చా. చా. నా ఉసురూ నా పిల్లల ఉసురూ ఊరికే పోతుందా పిన్నమ్మా. నాకేం తెలుసు ఆ చివర అది కూడా మంచం వేసుకుని పడుకునేదని. నేను తలుపేసుకుని నడుం వాల్చిం తర్వాత బయట ఏం జరుగుతూందో నాకేం తెలుస్తుంది చెప్పు. మొన్న పొద్దున్నే లేచి బావి దగ్గరకు వెళ్ళేసరికి దాని గదిలోంచి నవ్వుకుంటూ రాసుకుంటూ పూసుకుంటూ పాచిముఖం వాళ్ళిద్దరూ బయటికి రావటం చూశాను. కొయ్యబారిపోయానంటే నమ్ము."

పది మంది నాలుగు సానుభూతి మాటలు చెప్పినా, రామనాథాన్ని ఆ ముండని కలిపి పది తిటినా మాలచ్చికి ఒరిగిందేమిటి? రామనాథం మాత్రం రొమ్ము విరుచుకుని మదత మాయని నిగనిగలాడే బటలు తొడుక్కుని పూలరంగడిలా ఆ వీధులన్నీ తిరుగుతూనే వున్నాడు.

*　　*　　*

గదిలో రామనాథం కనకవల్లితో భుజం మీద చేతులు వేసి ఆమెను తన వైపుకు లాగబోయి అతనే ఆమె వైపుకు వంగిపోతుంటే ఏడుస్తూ రెండో పిల్ల గదిలో చొరబడి తండ్రి తొడమీద తల ఆన్చి బావురుమంది.

వినుగ్గా రామనాథం ఆ పిల్లని ఓ తోపు తోసి "పో పో.. అమ్మ దగ్గరకు వెళ్ళి చెప్పు..." అన్నాడు.

"అమ్మ కొట్టింది. అసమానం నన్ను అన్నయ్యని. తమ్ముడ్ని అమ్మ కొడుతూంది, నేను అమ్మదగ్గరకు వెళ్ళను. నాకు అమ్మ వద్దు..." అంటూ ఆ పిల్ల తండ్రిమీదకు ఎగబడి వెక్కి వెక్కి ఏడుస్తుంటే కనకవల్లి నిమ్మకు నీరెత్తినట్టుగా ఊరుకుందిగాని నోరు మెదపలేదు.

"పో.... అమ్మని కొట్టొద్దని చెప్పు... అంటూ ఆ పిల్లని బయటకు పంపి తలుపు మూసేశాడు రామనాథం.

నాలుగు రోజులు ఆ గదిలో కులికిన తర్వాత అయిదో రోజుకి కనకవల్లిని ఏకంగా ఇంట్లోకే తెచ్చి మాలచ్చి పీక మీద కూర్చొబెట్టాడు రామనాథం.

"ఛీ ఈ ముండకు సిగ్గూ ఎగ్గూ లేదు కాబోలు" అనుకుని మాలచ్చి వంట గదిలోనే చెంపలన్నీ చెరువు చేసుకుంది.


"నలుగురూ కనకవల్లిని చులకనగా చూస్తున్నారుట. ముఖంమీదే మాటలు విరుచుకుని నోటికొచ్చినట్టల్లా గుసగుసలు పోతున్నారుట." అదీ రామనాథానికి పట్టుకున్న బాధ ఇప్పుడు.

ఓనాడు చంటివాడ్ని అడ్డాల్లో వేసుకుని పాలుపడుతూ వంటగది గుమ్మందగ్గర కూర్చుంది మాలచ్చి. రామనాథం విసురుగా వచ్చి "నలుగురిలోనూ అల్లరిచేసి దాన్ని వెలివేస్తే ఊరుకుంటా ననుకుంటున్నావు కాబోలు. పోయి దాని దగ్గర కూర్చుని కబుర్లు చెప్పు. ముఖం మాడ్చుకున్నావా దెబ్బలు తింటావు" అని బెదిరించాడు.

అయినా మాలచ్చి పెదవి కదిపి కనకవల్లితో ఒక్క మాటకూడా మాట్లాడలేదు.

ఆరోజు మాలచ్చి ఒళ్ళు హూనం హూనం చేశాడు రామనాథం, మాలచ్చి ఎదిరించిన కొద్దీ ఎక్కువ దెబ్బలు తింది.

మాలచ్చి కనకవల్లితో మాటలు కలిపింది. మాటలు కలిపిన నాలుగోనాడు మంచీమర్యాదా లేకుండా కనకవల్లి




మాలచ్చిని 'ఒసేవ్.... ఏమేవ్....' అని పిలవసాగింది.

నాలుగు రోజులు పోయిం తర్వాత "కనకవల్లికి వేడి నీళ్లు కాచి తోలిపి ఇవ్వు" అని ఉత్తర్వు చేశాడు రామనాథం.

నోరెత్తకుండా మాలచ్చి ప్రతిరోజూ నీళ్ళుకాచి తోలిపి ఎండె స్నానాల గదిలో పెడుతూంది. సబ్బు, తువ్వాలూ కూడా అందిస్తూంది.

"ఓ రోజు దానితో సినిమాకు వెళ్ళు" అన్నాడు రామనాథం.

ఇంట్లో ఏ అవమానాన్ని సహించినా వీధినపడి కనకవల్లితో తిరగటానికి మాలచ్చి అంగీకరించలేదు. "నాకు వీలు పడదు, వంట్లో బాగులేదు" అని వంక చెప్పింది.

రామనాథం ఆ పూట ఎంతచెప్పినా ససేమిరా కాదన్న మాలచ్చిని వరండాలో స్తంభానికి కట్టి వెదురు బదలతో తట్లు తేలేలా కొట్టాడు.

ఆ సాయంత్రం వాళ్ళిద్దరూ సినిమాకి పోయిం తర్వాత రామనాథం చేతులు దులుపుకొని వీధిగేటుముందు నిలబడి ప్రతి ఇంటివైపూ చూశాడు. "ఈ శాకు అతి చెప్పుదెబ్బ బాగా తగిలింది," అనుకుని ముక్కుఊడిపోయేలా చీదేసి. కాండ్రించి ఊసి లోపలికి వచ్చేశాడు.

తెల్లవారేసరికి బట్టలుతుక్కుంటున్న భార్య పక్కకు, చేరాడు రామనాథం. ఆమె బుగలు పుణికి 'ముద్దొస్తున్నావు లచ్చీ.... చెప్పిన మాటవింటే ఇంకా.... ఇలా....' అంటూ ఆమె రెండు చెంపలూ చేతుల్లోకి తీసుకుని ముఖం ముందుకు లాక్కుని ముక్కుపుడక మెరుస్తూన్న మాలచ్చి ముక్కుమీద ముద్దు పెట్టుకున్నాడు.

అటుగా వచ్చిన కనకవల్లి ఆ దృశ్యం చూసింది.

* * *

"ఏం కనకవల్లీ' అలా పడుకున్నావు. మరీ స్తబ్దుగా కనిపిస్తున్నావు." అంటూ రామనాథం మంచంమీద కూర్చుని ఆమె వంటిమీద చెయ్యివేశాడు.

కనకవల్లి "ఇవాళ వంట్లో బాగులేదు. నన్నిలా పడుకోనివ్వు." అంది.

"ఏం జరిగింది? నాతో చెప్పు"

"అబ్బే ఏమీ జరగలేదు. నిజంగా ఒంట్లో బాగులేదు....నువీవాళ నా గదిలో పడుకోవద్దు....ఈ ఒక్క రోజూ నా మాట వినాలి" అంది.

రామనాథం ఎన్నో విధాల తంటాలు పడ్డాడు. కనకవల్లి ముసుగుతన్ని గోడ పక్కకి తిరిగి పడుకుంది. కనకవల్లి శరీరాన్ని తన వైపు తిప్పటం సాధ్యం కాలేదు రామనాథానికి. మాలచ్చా అటూ ఇటూ తేలిగ్గా పొర్లించటానికి? మంచం నిండుగా సరిపడే మనిషి కనకవల్లి. చేతులు పీకెట్టాయిగాని నూలువాసి చలనం ఆ శరీరంలో తేలేక పోయాడు. మాటకి మాట కూడా ఆమె చెప్పకపోవటంతో తలుపు తెరుచుకుని భార్య గదిలోకి చేరాడు.

భార్య పడుకున్న మంచం కిందనుంచి ఖాళీ మంచం లాగుతూంటే చప్పుడు కాక పోలేదు. అయినా మాలచ్చి పక్కనున్న చంటివాడి మీద చెయ్యివేసుకొని అటు తిరిగి పడుకున్నది పడుకున్నట్టే వుండి పోయింది. మంచం మీద బొంత పర్చుకుని దిండు వేసుకుని నడుం వాలుస్తూంటే తలుపు మెల్లగా వేసి అవతల గొళ్ళెం పెట్టిన చప్పుడు వినిపించి తలుపువైపు చూశాడు. కనకవల్లి చర్య అతనికి అంతు బట్టలేదు. 'ఆమెకేదో అసంతృప్తివుండి వుంటుంది. మాలచ్చి ఏదో అనే వుంటుంది. లోకులు ఆమె ముఖంమీదే ఏదో అని వుంటారు. భయం కాబోలు' అనుకున్నాడు సన్నటి వెలుగులో భార్యవైపు చూశాడు రామనాథం.

ఎముకలపోగులా కనిపించింది. ఆమె ఒళ్ళు కచకలా గరుగ్గావుంటుంది ముఖం మీద ముడతలుకూడా పడుతున్నాయి. బుగ్గలు లోతుకుపోయాయి. మెడకొంకులు బయటపడ్డాయి. కనకవల్లిలో వున్న మెరుపు, జవజవ మాలచ్చిలో లేవు. అయితేనేం మాలచ్చి మంచిపిల్ల. ఊళ్ళో వాళ్ళని అడ్డగాడిదలని చేసి తన పరువు కాపాడింది. కనకవల్లిని చూసి గుసగుసలు పోయేవాళ్ళు తల తీసికెళ్ళి ఎక్కడ పెట్టుకుంటారు? ప్రతిదీ వీళ్ళ సొంత సమస్యల్లా ముక్కులూ మూతులూ విరుచుకుంటారు. ఇవాళ కనకవల్లి అలక? ఏదో చిన్న పేచీ అయి వుంటుంది. కాస్త తాను మాలచ్చిని గట్టిగా మందలిస్తే భయపడితే దారిలోకి వచ్చేస్తుంది" అనుకుని సర్దుకుని పడుకున్నాడు రామనాథం.

పొద్దున్నే కనకవల్లి బాగావే ప్రవర్తించింది. పందుంపుల్ల తెచ్చి ఇచ్చింది. చెంబుతో నీళ్ళు తెచ్చి పెట్టింది. స్నానానికి నీళ్ళు తోలిపి ఇచ్చింది. ఆ రాత్రి రామనాథాన్ని నలిపి నున్నం నున్నం చేసేసింది. "మరి క్రితంరాత్రి అలా ఎందుకు చేసింది" అని అనిపించినా నిజంగా ఒంట్లో బాగులేదు కాబోలు అనుకున్నాడు రామనాథం.

కాని ప్రతి రెండు మూడు రోజులకీ కనకవల్లి ఇలాగే చేస్తుండేసరికి రామనాథానికి ఆలోచించక తప్పలేదు. ఆమెకు అన్నీ ఇంట్లో బాగానే జరుగుతున్నాయి అని ఆమే స్వయంగా అన్నది కూడాను. ఆమె చెప్పనివి తాను గ్రహించాల్సినవేం ఏమీ తోచలేదు రామనాథానికి. మార్చి కూడా మునుపటిలా పెద్దగా అల్లరేమీ చెయ్యటంలేదు; తరుచు వాళ్ళిద్దరూ సినిమాలకి పోతూనేవున్నారు. నోరు మెదపకుండా వండి వార్చి విస్తట్లో అన్నం కూడా పెడుతూంది. కనకవల్లికి వారం వారం తలంటు పోస్తుంది. చిక్కులుతీసి జడ వేస్తుంది. అప్పుడప్పుడు ఇద్దరూ కబురు చెప్పుకోవటమూ తాను చూశాడు. కనకవల్లి నోటి నుంచి ఒక్క ఆరోపణ మార్చి గురించి తాను వినటం లేదివరకు. "ఏదైనా వుంటే తేలదూ? ఇలా ఎందుకుంటుంది?" అనుకుని సద్దుకున్నాడు రామనాథం.

రామనాథం ఓసారి ఇంటికి వచ్చేసరికి విచిత్రమైన సంఘటన చూశాడు. ఈ మారు అతన్ని ఆశ్చర్యపరచింది.

ఆపూట చిన్న చిన్న సహాయాలు మార్చి చేసినా వంటంతా కనకవల్లే చేసింది.

భోజనం చేస్తూ ప్రతి పదార్థాన్ని తెగ



మెచ్చుకున్నాడు రామనాథం. మళ్ళీ మళ్ళీ వేయించుకుని మరీ తిన్నాడు.

ఈ తెలివి మాలచ్చికి అర్థంగాకపోలేదు. 'ఈ ముండ ఈ కొంపనిక వదిలేటులేదు.' అని అనుకుంది. కొత్తలో ప్రతిదీ విపరీతంగానే అనిపిస్తుంది. అలవాటుపడితే ఆ వైపరీత్యాలన్నీ సామాన్యంగానే అనిపిస్తాయి. మాలచ్చికీ అలాగే అనిపిస్తూందిప్పుడు, అప్పుడప్పుడు వాళ్ళు వీళ్ళూ ఆ ప్రసక్తి తెచ్చారా, పిల్లల భవిష్యత్తు గురించి స్థానబలిమిలేని తన హీనత్వాన్ని గురించి వాళ్ళు దిగులుపుట్టేలా సానుభూతి చూపించినా. నిర్లిప్తంగానే విని వూరుకుంటూంది. ఒకరిద్దరు అదికూడా ఏటా పిల్లల్ని కని ఇల్లు నింపేస్తే నీ పిల్లలు అన్యాయంగా వీథిన పడిపోతారు," అని హెచ్చరించేసరికి కొంచెం భయంగా అనిపించినా ఎప్పుడో ఏదో జరగబోయే వాటిగురించి ఆలోచించి బాధపడేపట్టు తగ్గిపోయింది మాలచ్చిలో, భర్తకూడా మునుపటిలా కాకుండా అడపా తడపా దగ్గరకు చేరుతూనే వున్నాడు. కనకవల్లిని ముద్దుగా చూస్తున్నాడు.నువ్వెంత ముద్దొస్తున్నావో" అంటూ ఏ తలుపు చాటునో తన రెండు చెంపలూ తడివి ముద్దు పెట్టుకుంటూ వుంటాడు.

* * *

ఆ ప్రశాంతత మధ్యలో మాలచ్చి మనస్సు మళ్ళీ కలత పడింది. స్థిరంగా వున్న చెరువులో అంతలోనే ఓ రాయి విసిరితే అలలు కదిలినట్టుగా ఆమెకు ఆలోచనలు—వాటిల్లోంచి భయమూ తోసుకొచ్చాయి.

మాలచ్చి కడుపు చిందుకుంచే విన్న వాళ్ళు "అప్పుడే? వచ్చి ఇరవై రోజులైనా కాలేదు... అప్పుడే నెల తప్పటం ఏమిటి? అదంతా తన ప్రయోజకత్వమే అనుకుంటున్నాడా? నీ మొగుడు. మేం చెప్పామా లేదా....అదిక ఏటా కనిపారేసి నీ కొంపగుండం చేస్తుంది' అన్నారు.

రామనాథానికి అదే అనుమానం రాకపోలేదు. వరండాలో పడుకుని తాను ఓ దృష్టి కనకవల్లి గదివైపు వేసే వుంచేవాడు. ఎవడో పాంటూ షర్టూ వేసుకుని రాత్రి బాగా పొద్దుపోయిం తర్వాత వస్తూండేవాడు. వాళ్ళిద్దరూ ఘర్షణ పడుతూండేవారు. వాళ్ళమాటల్లోంచి వాడొక సన్నకారు గుమాస్తాగాడని, వున్నదంతా ఊడ్చి దీనికే పోశాడనీ, ఇప్పటికిక మిగిలింది ఉద్యోగం మాత్రమేనని ఆ వచ్చేదేదో అతని సంసారానికే చాలదని. ఇన్నాళ్ళూ కనకవల్లి అతని అధీనంలోనే ఉందనీ రామనాథం గ్రహించాడు. వచ్చినప్పుడల్లా రెండో మూడో ...లో పెడుతున్నాడు కాబోలు. అయితే ఏ మాట కామాచే చెప్పుకోవాలి. వాడు తప్ప ఇంకెవర్నీ ఆమె చేరనిచ్చేదికాదు. అందుకనేగా తను చేరదీసింది. ఇక ఆ తర్వాత మాత్రం కనకవల్లి వాడ్ని చేరనివ్వలేదు. వాడితో ఖచ్చితంగా చెప్పేసింది. ఆమెని ఏకంగా తన సంసారంతో కలిపిందీ అందుకే, ఖర్చుకి ఖర్చూ కలిసొస్తుంది. కటుబాటులోనూ వుంటుంది. "ఇంతవరకూ అంతా బాగానేవుంది. ఇప్పుడీ గొడవ ఏమిటి? నా దగ్గరకొచ్చి ఇరవై రోజులయింది. అంతకుముందు వాడు వస్తూపోతూనే వున్నాడు." ఇంకా ఆలోచిస్తే అతనికేం అనిపించేదో కచికలాంటి లచ్చిని తప్పుకుని కనకవల్లి గదిలోకి పోయి ఆమెను చూసేసరికి అతనికి ఆవేశంలో అనుమానం అడుగున పడిపోయింది. కనకవల్లి కబుర్లు చెప్పింది. చివరికి రెండు వేళ్ళు చూపించి పట్టుకోమంది.

రామనాథం "ఎందుకు?" అన్నాడు అయోమయంగా చూస్తూ.

"తర్వాత చెబుతా. ముందు పట్టుకో"

ఓ వేలు పట్టుకున్నాడు రామనాథం.

"నేనూ అలాగేఅనుకున్నాను" అంటూ కనకవల్లి విలాసంగా ఓ నవ్వు నవ్వి మంచంమీద వెల్లకితలా పడుకుంది.


"ఏమిటే నువ్వనుకున్నది?" ఉగ్గపట్టలేక అడిగేసాడు రామనాథం.

"కొడుకుపుడతాడా కూతురు పుడుతుందా అని. నేను కొడుకే అనుకున్నాను. నువ్వూ ఆ వేలే పట్టుకున్నావు."

---

తామర్లేను చక్రవర్తి ఢిల్లీపై దండెత్తివచ్చినప్పుడు నగరంలో సంగీతానికి ప్రసిద్ధికెక్కిన ఒక వేశ్యను పిలిపించి, ఆమె మనోహర గానం విని "గాన విద్యాదేవత గ్రుడ్డిదై ఉంటుంది. కన్నులున్నదైతే, నీవంటి కురూపినాశ్రయించి ఇంత ప్రజ్ఞావంతురాల్ని చేసేదా?" అని పరిహాసించాడు. రణపెంకి అయిన ఆ వేశ్య "రాజా! నిజమే! గానవిద్యాదేవత గ్రుడ్డిదే! ఆమే కాదు! లక్ష్మికూడా గ్రుడ్డిదే! కాకపోతే, నీవంటి కుంటివాణ్ణి వరించి, ఇంత మహదైశ్వర్యం నీకెలా ఇచ్చి ఉంటుంది?" అని అడిగింది. తామర్లేను జన్మించినప్పటినుంచీ కుంటివాడే!

---



రామనాథానికి ముఖం ముడుచుకు పోయింది.

ఓ నెల్లాళ్ల తర్వాత అర్ధరాత్రి మెలుకువ వచ్చిన రామనాథానికి ఆ గుమాస్తా గుర్తుకొచ్చాడు. ఆమె కడుపువైపు చూశాడు. నిద్రలో ఆమె చెయ్యి తనమీద వేసింది. ఆమె తనవైపు వత్తిగిలింది. గుండెలమీద పైట జారిపోయింది. రవిక పై గుండీ ఊడిపోయింది. కనకవల్లికి మెలుకువవచ్చింది రామనాథం ఆమె చెయ్యి లాగి అట్టనే ఆమె మీదకు ఒరిగిపోయాడు. అంతే; ఆ ప్రవాహంలో పూచిక పుల్లలా కొట్టుకు పోయాడు రామనాథం. అనుమాన పిశాచం అడుగున పడి భూస్థాపితం అయిపోయింది.

ఎవరేమన్నా అతను పట్టించుకోలేదు. పుట్టబోయేవాడు తనవాడు అవునా కాదా అనే అనుమానం తనకి అనవసరం, తనకి కావాల్సింది కనకవల్లి; ఇప్పటి కనకవల్లి; ఆమెతోబాటు ఆమె గత జీవిత ఫలితాలూ కొన్ని తాను భరించక తప్పదు, అన్నట్టుగానే సరిపెట్టుకున్నాడు. ఎన్నాళ్ళు!!; మరో నాలుగయిదు మాసాలు, ఇప్పుడు కనకవల్లి రూపే మారిపోయింది. బుగ్గల మీదకు బుగలు వచ్చేసాయి. కండకు కండ అతికించినట్టుగా ఒళ్ళు పెరిగి అడుగు తీసి అడుగువేస్తే భూమి అణిగిపోతుందా అనిపించేట్టు తయారయింది. పొట్ట బానలా వుంది. కూర్చున్న మనిషి లేవటానికి ఉపక్రమం పడుతూంది. ఆమె దగ్గర సుఖంగా అనిపించటం లేదు రామనాథానికి.

ఈ అయిదు మాసాల్లోనూ మాలచ్చి కొంచెం ఒళ్ళుచేసింది. పుష్టిగా నిండుగా కనిపిస్తూంది. ఒళ్ళు నునుపుదేరి మాలచ్చి కళగా కనిపిస్తూంది.

ఉత్త కబుర్లు చెప్పుకుందుకు తప్ప కనకవల్లి కంటె మాలచ్చే ఎక్కువ ఆకర్షణగా అనిపిస్తూంది రామనాథానికి.

అవతల గదిలో కనకవల్లి దగ్గినా చీదినా పట్టించుకోలేదు రామనాథం.


మాలచ్చి మంచంమీద కూర్చుని 'లచ్చీ' అని పిలిచాడు.

ఆమె నవ్వి ముఖం దాచుకుని 'ఊఁ' అంది.

"ఇటు తిరుగు చెబుతాను."

మాలచ్చి అటునించి ఇటు తిరగలేదు.

రామనాథం బలవంతాన ఆమెను తన వైపుకు తిప్పుకుని గాఢంగా ముద్దు పెట్టుకున్నాడు.




మాలచ్చి బలంగా చేత్తో అతన్ని తోసేసింది.

రామనాథం చిన్నబుచ్చుకున్నాడు.

మాలచ్చి "నన్నిలా బ్రతకనివ్వు. ఇక్కడెందుకు? ఆ గదిలోకి పోయి పడుకో" అంది.

ఆమె చేతులు తన చేతిలోకి తీసుకుని దీనంగా చూశాడు.


ఆ చూపుకి కరిగిపోయింది మాలచ్చి.

ఆమె రెండు చెంపలూ చేతులమధ్య ఇరికించి ముఖం అంతా ముద్దులతో నింపేశాడు రామనాథం.

పొద్దున్నే పిల్లల మధ్య నవ్వుతూ తూలుతూ కబుర్లాడుకుంటూన్న మాలచ్చిని రామనాథాన్ని కనకవల్లి చూసింది.

మరో నాలుగు మాసాలకు అలాంటి దృశ్యాన్నే చూసింది మాలచ్చి మిఓనాడు. పెదగా ఆశ్చర్యపోలేదు. కనకవల్లి పక్కలో చంటివాడ్ని ముద్దులాడుతూంది. రామనాథం కనకవల్లి గడ్డం పట్టుకుని తన వైపు తిప్పుకుందుకు తంటాలు పడుతున్నాడు, కనకవల్లి పసివాడ్ని రామనాథం చేతుల్లో పెట్టింది. 'ముద్దుపెట్టుకో' అంది కనకవల్లి, 'ఎంగిలి తగిలిత్తే మంచిదికాదు....' అంటూ వెంటనే ఆమె చేతికిచ్చేశాడు చంటివాడ్ని. రామనాథం కనకవల్లి పక్కకు చేరాడు....... ఆమె ఏమందో మాలచ్చికి వినబడలేదు. భర్త గొంతు మాత్రం స్పష్టంగా వినిపించింది. "నాకు ఎవరైనా నీతర్వాతే అనుకో" అని.

అయితే ఆ తర్వాత కనకవల్లి భారం అనిపించలేదు రామనాథానికి, కనకవల్లికి మళ్ళీ కాన్పు మటుకు రాలేదు, ఈ ఆరేళ్ళూ అమిత సుఖంగా గడిచిపోయాయి అనటానికి వీల్లేదు, ఒకప్పుడు భార్యతో కాపురం చేసినప్పటి అనుభవాలతో పోల్చుకుంటే ఏదో తేడాగా అతను ఫీలవుతున్నాడు. ఇప్పుడతనికి మునుపటి ఆదాయం తగ్గింది. ఆరు సంవత్సరాల క్రితం తనదొక్కటే ఆ వీధిలో పచారీ దుకాణం. ఇప్పుడు అరడజను దుకాణాలు అదనంగా వెలిశాయి. కొంత రాబడి తగ్గింది. పోను పోను కొట్లో పని కుర్రవాడు కూడా బరువై పోతాడేమో అనిపిస్తూంది. పిల్లలు ఎదిగారు. పెద్దవాడికి పన్నెండేళ్ళొచ్చాయి– రెండో పిల్లకు పదేళ్ళు. మూడవవాడికి ఏడేళ్ళు... కనకవల్లి కొడుకు నర్సికి ఆరేళ్ళు నిండుతాయి. ఖర్చు బాగానే పెరిగింది. ఏదో నలుగురితోబాటే కాని ప్రత్యేకంగా కనకవల్లిని చూడటం తగ్గించేశాడు ఖర్చు దృష్ట్యా. ఈ రాబడి, ఖర్చు, బజా




రులో పోటీ దుకాణాల గురించీ కనకవల్లికి చెబుతూనే వున్నాడు.

"పిల్లలు చూడు ఎలా కలిసిపోయారో" అంది కనకవల్లి పెరట్లో ఆడుకుంటూన్న నలుగురి పిల్లలని చూపిస్తూ.

కనకవల్లి ముక్కు పట్టుకుని "మా లచ్చీ నువ్వూ కలిసిపోలా అలాగే" అన్నాడు రామనాథం.

"నర్సిగాడికి ఆరేళ్ళు నిండుతాయి కూడా. బడికి పంపించొద్దూ" అంది కనకవల్లి.

"పంపించు. ఎవరొద్దన్నారు? నీ పిల్లాడిని నువ్వు బడికి పంపుతానంటే నాకేవిటి అభ్యంతరం? నువ్వూరుకుంటె నేనూ ఊరుకున్నాను" అన్నాడు రామనాథం.

రామనాథం ముఖంలోకి చిన్నబుచ్చుకున్నట్టుగా చూసింది కనకవల్లి.

"ఏం అలా అంటున్నావు? నీ పిల్లవాడు కాడా నర్సి. నీ కేవీ కాడా? నీ కేవీ బాధ్యత లేదా? ఆఖరివాణ్ని బళ్ళో వేసేప్పుడే అనుకున్నాను. నర్సి గురించి పట్టించుకోనేలేదు" అంది.

"అబ్బే... అదేం లేదు.... చేర్పిద్దాం" అంటూ నసిగాడు రామనాథం.

"నేను గమనిస్తూనే వున్నాను. మిగతా పిల్లల్లా వాడిని నువ్వు చూడటంలేదు. తేడాగా చూస్తున్నావు"

"అబ్బే. తేడా ఏమీలేదు...... నీ కొడుకూ... నా పిల్లలూ...."

"అదిగో మళ్ళీ అదే మాట?"

"నోరు జారాను.... తేడా ఏమీలేదు. అంతా నీ అనుమానం"

"అనుమానం నాకా నీకా?"

"ఎందుకు లేనిపోని గొడవ."

"ఎన్నో వున్నాయి చెప్పుకోవాలంటే. మనసులో విరోధాలూ, అసహ్యాలూ పెట్టుకుని మసిలే వాళ్ళ మధ్య రోజులు గడుపుతున్నాను. ఇంత తిండి పెడుతున్నావు. అదే పదివేలు" అంటూ కనకవల్లి గోడవైపు తిరిగి పడుకుండిపోయింది.

ఎక్కువగా బ్రతిమలాడలేదు రామనాథం.

* * *

పచారీ దుకాణం తెరిచి, దుమ్ము దులిపి తక్కెట తగిలించి వాటికి పసుపూ కుంకుమా బొట్లు పెట్టి, హారతి కర్పూరం వెలిగించి వెంకటేశ్వరస్వామికి హారతిచ్చి కళ్ళ కద్దుకుని, రెండు అగరొత్తులు వెలిగించి వాటిని ఆ పటానికి గుచ్చి దండం పెట్టుకుని ఇటు తిరిగాడు రామనాథం.

"రెండు బీడీలియ్యి. ఈ సెంటర్లో ఇంకో దుకాణం లేకపోవటంకూడా నీ అదృష్టమే ననుకో. కొట్లో కుర్రాడ్ని మానిపించేసినా వేంటి ఖర్చు తగ్గుతుందనా" అంటూ కొండలు చిల్లర తక్కెట్లో వేశాడు.

ఆ డబ్బులు ముడెటుకుని గళ్ళాపెట్టెలో వేసుకుని "ఇవాళ నీదే బోణీ... కొట్లో సరుకంతా ఖాళీ అయిపోవాలి... కొట్లో కుర్రాడి సంగతి కదూ అడిగావు. వాడికి జ్వరంట. ఇవాళ రాడు" అన్నాడు రామనాథం బీడీకట్టలోంచి బీడీలు తీసి కొండలు కిస్తూ.

"ఇయ్యాళనించే మాలచ్చి నీ ఇంట్లో కలకలలాడిపోద్ది చూడు." అన్నాడు కొండలు. అదో మాదిరిగా చూస్తూ బీడీ ముట్టించి.

"ఏమిటో ఇవాళే కొత్తగా కొన్నట్టు మాటాడుతున్నావ్"

"అదిసరేకాని.. నీ రెండో ఆవిడకు... ఆ బంగారయ్య... సెంటరులో బియ్యం కొట్టాయనయ్య.. ఏంటి అలా చూస్తావ్. బంధువా.. స్నేహితమా.." అన్నాడు కొండలు.

"ఏంటి నువ్వనేది?" అన్నాడు రామనాథం బుర్ర తిరిగిపోయి నోరు అప్పగించి.

"నిన్న ఆ పక్క సందులో మీ రెండో ఆవిడా ఆ బంగారయ్యా చాలాసేపు ఊసులాడుకుంటూంటే చూశా. బంధువేమోనని అడిగా. ఒస్తా....... పనుంది...." అంటూ కొండలు వెనక్కి వెనక్కి తిరిగి నవ్వుతూ సందులోకి తిరిగాడు.



రామనాథానికి ఆ పూటంతా మనసు మనస్సులోలేదు. బంగారయ్యతో దీనికేంటి ఊసు......ఏభై ఏళ్ళవాడు ........ పిల్లా పిచికా లేరు. చిన్న బిలింగు కట్టాడు ఈ మధ్య. ఇల్లంతా దీపాల మయమే కాని ఇంటికి దీపం లాంటి ఇల్లాలు ఈ మధ్యనే చచ్చిపోయింది. ఒంటరిగాడు.... వాడితో దీనికేటి ఊసు.... పోరూ పొక్కా ఉండదనుకుందా? ఆడికా బాగా చూస్తాడనా?' కంగారు కంగారుగా వ్యాపారం చేశాడు- ఆ పూట అడిగిన వాళ్ళకి ఒకటివ్వబోయి ఇంకొటిచ్చి. చేతులు ఒణుకుతూంటే పొట్లాలు అవలీలగా చుట్టలేకపోయాడు. ఒంటిగంటకు మూసే దుకాణాన్ని పదకొండింటికే మూసేశాడు. ఉరుకూ పరుగుల్తో ఇంటికి చేరాడు. పిల్లలమధ్య ఆడుకుంటూన్న నర్సి నాన్న... నాన్న.... అంటూ రెండడుగులు ముందుకు వేసిఆగిపోయాడు- వాడ్ని పక్కకు నెట్టాడు రామనాథం.

గదిలో కనకవల్లి చేటలో బియ్యం ఏరుతూ గడపవార కూర్చుంది.

మాలచ్చి గొంతు పెరట్లో వినిపిస్తుంది.

రామనాథం తలుపు దగ్గరగా వేసి "ఈ ఇల్లు నీకు చేదయిందా? వాడు.... వాడు.... వాడితో నీకేం పని?" అన్నాడు ఆవేశాన్ని అణిచిపెట్టుకుంటూ.

"వాడెవడు?" అంది కనకవల్లి.

"ఎవడో నీకు తెలియదా? నా దగ్గర నాటకం ఆడకు. వుంటే నా దగ్గర తిన్నగా వుండు. లేదా వాడితోనే వుండు. అటూ ఇటూగా నాటకం సాగిస్తే నేనూరుకోను. తెలుసుగా నా సంగతి" అన్నాడు రామనాథం.

కనకవల్లి జవాబు చెప్పలేదు.

రామనాథం మరి రెక్కించలేదు. పెరట్లోకి వెళ్ళిపోయాడు కోపంగా.

చేటలో బియ్యం అటూ ఇటూ కెక్కిరిస్తూ పళ్ళు బిగపట్టి నుదుటి మీద పడుతూన్న వెంట్రుకల్ని వెనక్కి తోసుకుంది కనకవల్లి.

* * *

మర్నాడు రాత్రి బాగా పొద్దుపోయిం తర్వాత కొట్టుమూసి ఇంటికి వచ్చేసరికి వంట గదిలో కనకవల్లి కనబడలేదు.

"వల్లి ఏదీ కనబడలేదు" అని ఎదురొచ్చిన మాలచ్చిని అడిగాడు.

"ఏమో నాకేం తెలుసు. మధ్యాహ్నం తన బట్టలూ, వస్తువులూ తీసుకుని రిక్షాలో వెళ్ళింది. ఎక్కడికని నేనూ అడగలేదు, ఆమె చెప్పనూలేదు. ఇంతవరకూ రాలేదు" అంది మాలచ్చి.

మర్నాడు వీధి ముఖం చూడ్డానికి సిగ్గుపడిఇంట్లోనే వుండిపోయాడు రామనాథం. మాసిన గడ్డమయినా చేసుకోలేదు. మాలచ్చి పదిసార్లు హెచ్చరిస్తే కాని స్నానం అయినా చెయ్యలేదు.

"కొట్టుకు పోవూ?" అని హెచ్చరించింది మాలచ్చి.

"ఇవాళ ఒంట్లో బాగులేదు" అన్నాడు రామనాథం-

"ఎడిసినట్టే వుంది మగసిరి" అని మనసులోనే అనుకుని మాలచ్చి పెరట్లోకి వెళ్ళిపోయింది. బట్టలకి సబ్బు పట్టించి ఆరేస్తూ, నవ్వుకుంటూ పనిలోంచి మధ్య మధ్య భర్త పచార్లు చేస్తున్న గదివైపు చూస్తోంది.

రామనాథం పెరట్లోకి వచ్చాడు "ఆ గడ్డం గీసుకుని నీటుగా ఇస్త్రీ మడత తీసుకుని. దర్జాగా సిగరెట్టు కాలుస్తూ వీధిన పడి హాయిగా కొటుకుపోక ఇంటిపట్టున దేనికీ? వెళ్ళి పని చూసుకో." అంది మాలచ్చి ముఖం పక్కకు తిప్పుకుని నవ్వుకుంటూ.

రామనాథానికి రోషంగా వుంది. మళ్ళీ లోపలికి వెళ్ళిపోయాడు.

పది నిముషాల తర్వాత ఉతికిన బట్టలు ఆరేస్తుంటే వీధి గేటు దగ్గర భర్త గొంతు వినిపించింది.

"నువ్వెందుకురా వచ్చావ్? లంజకొడకా చెప్పింది నీక్కాదూ. పో. పో. ఆ లంజ దగ్గరకే పో... లంజంటే అర్థం కాలేదా? నీ అమ్మ దగ్గిరికి పో. మళ్ళీ ఇక్కడ కొచ్చావంటే కాళ్ళు విరక్కొడతా. పిల్లలూ మీరు లోపలికి పొండి."

"నాకు అమ్మ వద్దు. అన్నయ్యలూ, అక్కాయీ కావాలి. వీళ్ళతో ఆడుకుంటాను ఇక్కడే వుంటాను" అంటున్నాడు నర్సి.

మాలచ్చి గుమ్మంలోకి వచ్చేసరికి తన ముగ్గురి పిల్లల్నీ వెంటబెట్టుకుని ఇంట్లోకి వస్తున్నాడు రామనాథం.

"ఎందుకు నాన్నా తమ్ముడ్ని అలా తిట్టి బైటికి గెంటి గేటు మూసేశావు?' అని అడిగింది రెండోపిల్ల.

"ఎందుకోలే... మీ కర్థంకాదు. మీరు చిన్న పిలలు. వాడిని ఇక మీతో కలవనివ్వకండి." అన్నాడు రామనాథం ఏదో పెద్ద విషయాన్ని చిన్న పిల్లలకు చెప్పటం అసభ్యతనో, అసహ్యం అనో, లేక చెప్పటం సాధ్యపడకో.

'పెద్దబ్బాయిగారూ వడ్డించాను వస్తారా?' అంటూ కేకేసింది మాలచ్చి వంటగది లోంచి. ★

